# చెల్లియో.... చెల్లకో....

పెన్నేరు పాప



ఓ దివ్యమైన ముహూర్తం చూసుకుని పట్నంలో కాపురం పెట్టిన కొడుకింటి కెళ్లాడు అబ్బయ్యనాయుడు. మందువాల్లోనూ పెద్ద పెద్ద పెంకుటి చావిళ్లలోనూ యధేచ్ఛగా తిరిగే ఆయనకు వరుసగా కనిపిస్తున్న ఆ బుల్లి పోర్షన్లు విసుగెత్తించాయి. యీ చివర నుండి ఆ చివర వరకు పరికించి చూసాడు. "పడ్డ దూడను కూడా కట్టేసుకోటానికి చాలని యీ గొందుల్లోనా తన కొడుకు కాపురం వుండేది?" అనుకుంటూనే ఇల్లు గుర్తు పట్టాడు.

వసారా దాటి రెండడుగులేసి మూడో అడుగేయ డానికి మోకాలెత్తితే తగిలేది నిలువెత్తు గోడ.

"యిది యిల్లా అమ్మాయ్" గొంతంతా పెంచి అరిచాడు.

"అయ్యో అంత గట్టిగా అనకండి. ఆఫీసుకు దగ్గరని ఎంత కష్టపడి తీసుకున్నాం?"

"తప్పేదియ్యా యీ గదికి సిఫారసులా. అహహ.." అంటూ గట్టిగా నవ్వాడు.

అప్పటికే అరడజను తలలాడుతున్నాయ్ గుమ్మంలో.

"మా మావగారండీ" యిరుగుపొరుక్కి యికి లిస్తూ చెప్పింది వసుమతి.

మెరిసిన మీసాల్ని మెలిపెట్టుకుంటూ నాటకీయంగా ఫోజు మార్చాడు అబ్బయ్యనాయుడు.

ఎవరి గదుల వేపు వారు జారుకున్నారు.

సాయంత్రం అవుతోంది. వాళ్లారిలా చల్లగా కాదు. గందరగోళంగా, గజిబిజిగా.... వీళ్ల దగ్గర గలగల లనూ, గలాటాలనూ చూస్తూ కూర్చున్నాడు. మంత్రి గారి పరామర్శలో సానుభూతి కన్నీటి చుక్కల్లా రెండు బొట్లు రాల్చి మూతి బిగించేసిందా పంపు.

"ఇదేం పంపమ్మాయ్!"

ఆయన ఆశ్చర్యానికి కోడలి నవ్వే సమాధానం.

సాయంత్రం స్నానం లేని ఆయనకు గుమ్మంలో గాలి కోసం మంచం వేసింది. అటు రెండూ ఇటు రెండూ కోళ్లను ఆన్చిన మంచం కిందుగా సైడు కాలువ పారుతుంటే దానిమీంచి వచ్చే దుర్గంధానికి డోకు ఒక్కటే తక్కువ ఆయనకు. అయినా దానినే పిల్ల కాలువలా వూహించుకుంటూ నడుం వాల్చాడు.

సాయం సంధ్య వయ్యారాలొలుకుతూ వస్తోందా సొంపు మధ్యకు. మెల్లిగా ఆ సంధ్యనూ మింగుతూ చీకటి తెర దిగుతోంది లోకం మీదికి. ఆ పోర్షన్లలో వుంటున్న మగవాళ్ళు యింటికి చేరుకుంటున్నారు. అదను చూసుకుని కొసరన్నట్టు పద్యం మొదటి చర ణాన్ని ఆలపించాడు అబ్బయ్యనాయుడు. అబ్బే..! అతను వూహించినట్టు ఏ ఒక్కరూ తల తిప్పి చూడలేదు. రాత్రి భోజనాలు ముగించి అందరూ బయట నడుం వాల్చారు. ఆ సమయం కాస్త నిశ్శబ్దంగానే వుంది. తన పాట వాళ్లు వినాలంటే యిదే అదను. అనుకున్నదే తడవు కురుక్షేత్రం నాటకం పద్యాన్ని అందుకున్నాడు.

కంగారుపడ్డ కోడలు ఒక్కుదుటున లేచి గళానికి గట్టుపెట్టి వెళ్లింది.

"ఆపి వీళ్ల సిగ తరగా. వీళ్లకి కళాదృష్టి బొత్తిగా లేదేం? యీ వెస్ట్రన్ మ్యూజిక్కులకు అలవాటుపడి పాత రాగాల్నే పాతరేసేస్తున్నారు. ఒకడు...ఒక్కడు కూడా "బాబాయిగారూ, యిందాకేదో పద్యం మొద లెట్టారు. దాన్ని ఆపేసారేం? పూర్తి చేయండి" అని అగడరేం? వీళ్లకి సాంప్రదాయపు రాగాలు అవసరం లేదా? జీవకళ వుట్టిపడే యీ గీతాలు వాళ్లకు యింపుగా వుండవా? యివేం పాటలు? యివేం డాన్సులు? తను మొన్న మోడల్ డాన్సంటే వెళ్లి చూసొచ్చాడు. కూటి కుండలో పడ్డ కుక్కను కొడితే ముందు కాళ్లిరగి వేళ్లాడేసుకు ఏడుస్తున్న కుక్క పరుగులా వుందా డాన్సు. అర్థం తెలియని అరుపులతో కర్ణభేరీలు పగిలే యీ పాటలు పసందైనవా! నా పాట కొంచెంగా విన్న వీళ్లలో ఏ ఒక్కడూ పాడండని అడగడేం? లాభం లేదు మరొక్క సారి ప్రయత్నించి చూస్తా. దాంతో జయరాంగారి తండ్రి కురుక్షేత్రంలో పద్యం ఎత్తుకున్నాడంటే... ఓహ్ అనాల్సిందే పోర్షన్లలోని వారందరూ .

"బాబాయిగారు ఎన్నాళ్లయిందీ రాగాన్ని విని. ఏవిటో యీ బిజీ జీవితంలో యీ అరుపులకే అలవాటు పడ్డాం" అంటూ తన నెత్తిన కీర్తి కిరీటాన్ని అలంకరించి బతిమాలించుకు మళ్లీ మళ్లీ పాడించాలి . అలా వూహిస్తూ దోమలపై దండెత్తుతూ రేయి గడిపాడు.

మరో రెండు రోజులు గడచినా ఏ ఒక్కరూ తన పాట గురించి అడగలేదు. కోపం, వుక్రోషం పీకల్ని తొక్కేస్తోంది. దానిని అణుచుకోటం అసాధ్యంగా తోస్తున్నా ఎలాగో ఓర్చుకున్నాడు. లాభం లేదు. యీ రాత్రి ఎట్టి పరిస్థితుల్లోనూ తమ పద్యాన్ని పాడి అర మోడ్పు కన్నులతో అందరూ తన మంచం చుట్టూ చేరేలా చేసుకోవాలి.

అనుకున్నట్టుగానే అమలుపర్చాడు. గొంతు శృతి చేసుకుంటూ అన్ని మంచాల్నీ పరికించి చూసాడు.

'కరెంటుండి వెలుగు కొరత. నదులుండీ నీటి కొరత' అనుకుంటూ మంచాల మీదివారు అస్థిమితంగా కదులుతున్నారు. మూడు రాత్రులు డ్యూటీ చేసి వచ్చి పడక కుదరక కొట్టుకుంటున్నాడు ప్రక్క పోర్షన లారి డ్రైవర్.

అబ్బయ్యనాయుడు పద్యాన్నందుకున్నాడు. అంతే- రావా? వద్దా? అనే నిద్ర మారామడల దూరం పారి పోయింది.

"చెల్లియో... చెల్లకో..... తమకు చేసిన...."

కొందరు లేచి మంచాల మీద కూర్చున్నారు.

రాగం పెరగడానికి సిద్ధంగా వున్న సమయంలో నిద్రలోకి జారిపోబోతున్న లారీ డ్రైవర్ పెళపెళార్బా టాలతో లేచి అసహజమైన బూతులతో అక్షరలక్షలు కురిపించాడు అబ్బయ్యనాయుడు నెత్తి మీద.

అర్థరాత్రి మొదలైన రాగం తూర్పు తెల్లబడు తుండగా ముగించినా ఒక్కడూ నోరెత్తలేదు వాళ్లల్లో! అలాటి అబ్బయ్యనాయుడు మొదటిసారి ప్రతిఘటనతో అప్రతిభుడయ్యాడు.

అప్పటికే బయటకొచ్చిన కొడుకు, కోడలు "ఇది మనూరు కాదు. ఉక్కగా వున్నా యిక్కడే పడుకోండి. ఎందుకు వాళ్ల నిద్రలను పాడుచేస్తారు" అంటూ ఆయన్ను యింట్లో పెట్టి తలుపు బిగించారు.

యింట్లో వారి నసతో పాటు బయటివారి విసుర్లు చాలా చురుగ్గా వినిపిస్తున్నాయ్ అబ్బయ్యనాయుడికి. అవమాన జ్వరానికి తోడు కళ్లు నీళ్లతో చిప్పిల్లడానికి సిద్ధంగా వున్నాయ్. దేశం ముందుకు పోతోందంటే సంతోషించాడు కాని, పాతను మరీ యింత పాతాళానికి తొక్కేస్తున్నారనుకో లేదు. పడక జముడ ముళ్ళ పొదల్లా తోస్తుంటే ఎవరికీ చెప్పా పెట్టకుండా వీర అలుగుడితో తొలిఝామునే లేచి తన వూరి దారి పట్టాడు.

అతనిలో కసి ఉప్పెన అవుతోంది. దాని నణచి ఉపశమనాన్ని పొందాలంటే పాత రాగాన్నే పదే పదే ఆలపించాలి. అదే అతని మనసుకు దివ్యౌషధం అను కుంటూ పద్యం అందుకున్నాడు.

వీధి మధ్యలో విశ్రాంతి తీసుకుంటున్న వూరకుక్క ఉలికిపడి లేచి చెవులు ముందుకు నిటారుగా సాగలాగి మోరెత్తి మొరుగుతూ ఆగి ఆగి అబ్బయ్యనాయుడి వెంట పడుతోంది.

"ఛత్... నీ.....గల్లంతు సంగీతానికి అలవాటు పడ్డ నీక్కూడా యీ పద్యం నచ్చలేదా?" అంటూ రాయి కోసం పిచ్చివాడిలా పక్కకు పరుగెత్తి కసితీరా విసిరి కొట్టాడు.

సరిగ్గా ఆ రాయి శునకం మూతి మీద తగిలి కొత్త రకంగా ఏడుస్తూంటే "ఆ... యిదే.. యిదే.. యీ జనానికి కావలసిన సంగీతం. భయానకమైన యీ ధ్వనే వీళ్లకు యింపైన సంగీతం" అనుకుంటూ మరో గడ్డతో కుక్కను రెచ్చగొట్టి తన వూరి వేపు దూసుకుపోతు న్నాడు కోరిక తీరని అబ్బయ్యనాయుడు.